యాప్‌లో రుణమాఫీ కాని రైతుల వివరాలు

● నమోదు చేస్తున్న అధికారులు ● సందర్శించిన వ్యవసాయశాఖ జిల్లా అధికారులు

పూడూరు : అంగడిచిట్టంపల్లిలో రుణమాఫీ కాని రైతు వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

ఉప్పరిగూడ రైతు వేదికలో వివరాలు తెలుసుకుంటున్న రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

పూడూరు,ఆగస్టు 28 : రుణమాఫీ కాని రైతుల నుంచి సరైన సమాచారం సేకరించి ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు యాప్ ద్వారా పంపిస్తునట్లు వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం పూడూరు మండలం అంగడి చిట్టంపల్లి, చన్గోముల్ గ్రామాల్లో ఏవో తులసీరాం ఆధ్వర్యంలో రైతు కుటుంబాలను సందర్శించి కుటుంబసభ్యుల వివరాలను సేకరించారు. ఎస్‌బీఐలో రుణాలు తీసుకున్న లిస్టు ప్రకారం రెండు గ్రామాల్లో రుణమాఫీ కాని 22 మంది రైతు కుటుంబాలను సందర్శించి వివరాలను సేకరించినట్లు డీఏఓ పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండి ఒకే రేషన్ కార్డు ఉండటంతో కొంతమంది రైతులకు రుణ మాఫీ కాలేదని వారి వివరాలను ప్రభుత్వానికి అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బ్యాంక్‌ల లిస్టు ప్రకారం పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు. రైతులు నవాజ్‌రెడ్డి, లింగప్ప, నారాయణ, నర్సింహారెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివరాలను పకడ్బందీగా చేపట్టాలి

ఇబ్రహీంపట్నం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ. 2 లక్షల వరకు రుణ మాఫీ కాని రైతుల వివరాలను పకడ్బందీగా చేపట్టాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు సంబంధిత అధికారులకు సూచించారు. మండలంలోని ఉప్పరిగూడ రైతు వేదికలో బుధవారం రుణమాఫీ కాని రైతు వివరాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా రుణాలు మాఫీకాని రైతుల వివరాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారితో పాటు విస్తరణాధికారి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

మంకీపాక్స్‌తో భయం వద్దు

● సపోర్టింగ్ ట్రీట్‌మెంట్‌తో చెక్ పెట్టవచ్చంటున్న వైద్యులు

సిటీబ్యూరో, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): మంకీ పాక్స్‌తో భయం అవసరం లేదని వైద్యనిపుణులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఒక్క కేసు కూడా నమోదు కాకపోయినప్పటికీ గాంధీ, నల్లకుంట ఫీవర్ వైద్యశాలల్లో ముందస్తుగా ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేయడంతో మంకీ పాక్స్‌పై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. అయితే మంకీ పాక్స్ అనే వైరస్ కొత్తేమీ కాదని, అది పాతదే అని, సపోర్టింగ్ ట్రీట్‌మెంట్‌తో వైరస్‌కు చెక్ పెట్టవచ్చని వైద్యులు అంటున్నారు. 1950లో తొలిసారిగా ఈ వైరస్‌ను కోతుల్లో గుర్తించడం వల్ల దీనికి మంకీ పాక్స్ అనే పేరు వచ్చిందని చెప్పారు. ప్రారంభంలో కోతులకు వచ్చిన వైరస్.. క్రమంగా వాటి నుంచి మనుషులకు సోకింది. ఆ తరువాత ప్రస్తుతం మనుషుల నుంచి మనుషులకు సోకుతోందని అంటున్నారు.

కాగామంకీపాక్స్ అనేది ఆర్థోఫాక్స్ జాతికి చెందిన ఒక వైరస్ అని, మరణాల రేటు చాలా తక్కువగా ఉంటుందని యాదాద్రి భువనగిరి ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తెలిపారు.

డీసీఎం ఢీకొని కాపరి సహా పది గొర్రెలు మృతి

● క్షతగాత్రుడిని దవాఖానకు తరలించిన బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

తీవ్రంగా గాయపడిన గొర్రెల కాపరిని దవాఖానకు తరలిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు, ఆగస్టు 28 : డీసీఎం ఢీకొని ఒక వ్యక్తి, పది గొర్రెలు మృతిచెందిన సంఘటన బుధవారం మండలంలోని కొనపూర్ గేట్ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడ మండలం హనుమాన్‌పల్లికి చెందిన ఆంజనేయులు కొనపూర్ గేట్ సమీపంలో గొర్రెలను హైదరాబాద్- శ్రీశైలం హైవే వెంట మేపుకొంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వెళ్తున్న డీసీఎం గొర్రెలను, కాపరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గొర్రెల కాపరి ఆంజనేయులు తీవ్రంగా గాయపడగా పది గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి.

మానవత్వం చాటిన మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

అదే సమయంలో నాగర్‌కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు,మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రమాద ఘటనను చూసి చలించిపోయారు. అంబులెన్స్‌కు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో ప్రైవేటు వాహనంలో క్షతగాత్రుడిని ఆమనగల్లు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అయితే మార్గమధ్యలోనే ఆంజనేయులు మృతిచెందాడు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ద్విచక్రవాహనంపై దవాఖానకు చేరుకుని డాక్టర్లతో మాట్లాడినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంబులెన్స్ సౌకర్యం లేకపోవడం విచారకరం..

ప్రజా ప్రభుత్వం అని పదే పదే చెబుతున్న కాంగ్రెస్ నాయకులు పేదల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి వెంబడి వైద్య సదుపాయం కల్పించడంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందన్నారు. హైవేను నాలుగు లేన్లుగా విస్తరించి ప్రమాదాలను నివారించాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారుల వెంట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆత్యాధునిక సదుపాయాలతో దవాఖానలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆదే విధంగా ఆమనగల్లులో నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ దవాఖానను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

● హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలి ● కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల ధర్నా, మహా ర్యాలీ

వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

వికారాబాద్, ఆగస్టు 28 : సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు జిల్లాలో పని చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు మహా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష, ధర్నా చేపట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబర్‌లో సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె చేస్తుండగా టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హన్మకొండలో పాల్గొని సమగ్ర శిక్షా ఉద్యోగులను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. బేసిక్ పే(మినీమం టైం స్కేల్) అమలు చేస్తామని పేర్కొన్నట్లు తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా సీఎంగా రేవంత్‌రెడ్డిని, మంత్రులను ఈ విషయమై అనేకమార్లు కలిసి వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికే 169 మంది ఉద్యోగులు వివిధ కారణాలతో ప్రాణాలు కోల్పోయారని, అయినా ప్రభుత్వం చిల్లి గవ్వ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 61 ఏండ్లు నిండిన 100మందికి పైగా ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా తొలగించారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ కూడా ఇవ్వలేదని మనోవేదనకు గురయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. తమకు రూ. 10లక్షల ఆరోగ్య బీమా, రూ. 10 లక్షల జీవిత బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి సమ్మెకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ధర్నాలో జిల్లాలోని సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

● సాంఘిక సంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి అలుగు వర్షిణి

కొత్తగడి గురుకుల కళాశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న సాంఘిక సంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి అలుగు వర్షిణి, కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఆగస్టు 28 : విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి అలుగు వర్షిణి అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కొత్త గడి సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని వంటగది, స్టోర్ రూమ్, విద్యార్థుల విశ్రాంతి గదులను పరిశీలించి హాజరు పట్టిక, స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భోజనం తిని బాగుందని ప్రశంసించారు. తెలుగు అకాడమీ టెక్స్ట్ బుక్స్ పంపిణీని పర్యవేక్షించారు. సెప్టిక్ ట్యాంక్ క్లియరెన్స్ కోసం బడ్జెట్ అంచనా రిపోర్ట్ పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హాస్టల్ గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మంచాలు రెండు భాగాలుగా చేసి విద్యార్థులకు గాలి, వెలుతురు వచ్చేట్లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య అత్యంత శక్తివంతమైన ఆయుధమని దానికి ప్రపంచాన్ని మార్చే శక్తి ఉందన్నారు. విద్యార్థులు బాగా చదివి జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు.

కార్యక్రమంలో డీసీఓ సాయిలత, అడిషనల్ సెక్రటరీ హనుమంతు నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీ ఆలయంలో

వైభవంగా ఉట్ల పండుగ

ఆలయ పురవీధుల్లో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

మొయినాబాద్, ఆగస్టు 28: మండలంలోని చిలుకూరు బాలాజీ ఆలయంలో ఉట్ల పండుగ అర్చకులు మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా జరిగింది. కృష్ణుడి జన్మాష్టమి మరుసటి రోజు ఆలయంలో ఉట్ల పండుగ నిర్వహించడం అనవాయితీ. అందులో భాగంగా బుధవారం చిలుకూరు బాలాజీ ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఆలయ పుర వీధుల్లో ఊరేగించారు. శ్రీకృష్ణుడి నామస్మరణలతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణ నెలకొంది. ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ శ్రీకృష్ణుడి జన్మ విశిష్టతను వివరించారు.

ఆలస్యంగా మేల్కొన్న ఐటీ వింగ్

సిటీబ్యూరో: ఇన్నాళ్లు తన పనిని పక్కన పెట్టేసిన సిటీ పోలీస్ కమిషనరేట్‌లో ఐటీ విభాగం..ఆలస్యంగానైనా మేల్కొంది. రెండు నెలల కిందట తెలంగాణ మొబైల్, కంప్యూటర్ అప్లికేషన్లు హ్యాకింగ్ గురికావడంతో సిటీ ఐటీ విభాగం పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఈ క్రమంలో ఇప్పుడిప్పుడే మేల్కొని.. అప్లికేషన్లను పునరద్ధరిస్తున్నది. ఇందులోభాగంగానే హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన వెబ్‌సైట్‌ను రెండు రోజుల కిందట పునరుద్ధరించారు. పోలీసింగ్‌కు మానవ వనరులు ఒక ఎత్తయితే, టెక్నాలజీ కూడా అందుకు తన వంతు సహకరిస్తూ శాంతి భద్రతల పర్యవేక్షణ, నేర నివారణలో తోడ్పాటునందించాయి. అయితే అప్లికేషన్ల పునరుద్ధరణ జరగడంతో పర్యవేక్షణ కొనసాగుతుందని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

హ్యాకింగ్ అయిన వివిధ యాప్‌ల పునరుద్ధరణ

పోలీస్ స్టేడియానికి పేట్లబుర్జులో స్థలం

సిటీబ్యూరో: గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనాన్ని నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో ఈమేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం గోషామహల్‌లో ఉన్న పోలీస్‌స్టేడియానికి ప్రత్యామ్నాయంగా భూమి కేటాయించేందుకు బహదూర్‌పురలోని పేట్లబుర్జులో ఉన్న పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్, సిటీ పోలీస్ అకాడమీలోని స్థలాన్ని పరిశీలించారు. త్వరలో ప్రభుత్వానికి స్థలం అప్పగింతపై నివేదిక ఇస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ భాస్కర్, ఇన్‌చార్జి ఆర్డీఓ జ్యోతి, తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చల్లంగ చూడు అమ్మోరు తల్లీ..

అమనగల్లులో ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు

అమనగల్లు : బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఆమనగల్లు, ఆగస్టు 28 : ఆమనగల్లు మున్సిపాలిటీలో బుధవారం పూసల, ఎరుకల కులస్తులు పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో ఉదయం బోనాలను అలంకరించారు. సాయంత్రం భాజాభజంత్రీలు, శివ సత్తుల పూనకాలు, కళాకారుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలతో బోనాలను ఊరేగించి వారి వారి ఆలయాలకు చేరుకుని బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పూసల సంఘం గౌరవాధ్యక్షుడు పస్పులేటి నర్సింహ, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, నాయకులు వెంకటేశ్, సత్యం, భాస్కర్, అంజి, మోహన్, రాము, పరమేశ్, నరేందర్, అశోక్, ఉషారాణి, మైసమ్మ, లక్ష్మమ్మ, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ మండలంలో...

కడ్తాల్ : మండలంలోని మైసిగండి, మక్తమాదారం, ముద్విన్ గ్రామాల్లో బుధవారం బోనాల పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకొన్నారు. మైసిగండి మైసమ్మతల్లి ఆలయంలో నిర్వహించిన పూజలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అమ్మ వారికి అభిషేకం, అర్చనలు, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధులగుండా మహిళలు బోనాలతో వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, తాసీల్దార్ ముంతాజ్, సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కడ్తాల్ : మైసిగండి గ్రామంలో బోనాలతో వెళ్తున్న మహిళలు



యాచారం : కుర్మిద్ద గ్రామంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, శివసత్తులు

కుర్మిద్దలో సోమన్న బోనాలు

యాచారం : మండలంలోని కుర్మిద్ద గ్రామంలో బుధవారం సోమన్న బోనాల పండుగ అంగరంగ వైభవంగా జరిగింది. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా మహిళలు బోనమెత్తి ఊరేగించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు అలరించాయి. పిల్లల కేరింతలు, యువకుల నృత్యాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కోరిన కోర్కెలు తీర్చాలని భక్తులు అమ్మవారికి కోళ్లు, మేకలు బలి ఇచ్చారు.

అమనగల్లు : సెల్ఫీ తీసుకుంటున్న మహిళలు

సమ్మిట్ లోగోను ఆవిష్కరిస్తున్న అధికారులు

రేపు 'ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్-2024'

సిటీబ్యూరో: అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో ప్రైవేట్ సెక్యూరిటీ అవసరాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని ఈ నేపథ్యంలో ఈ నెల 30న హైదరాబద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో నేషనల్ ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్-2024ను నిర్వహిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. హెచ్‌సీఎస్‌సీకి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, కన్వీనర్‌గా అదనపు కమిషనర్(లా అండ్ ఆర్డర్) విక్రమ్ సింగ్‌మాన్, సెక్రటరీ జనరల్‌గా శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా చైర్మన్, జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ ఫిజికల్ సెక్యూరిటీ ఫోరం ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో నిర్వహిస్తున్న ఈ సమ్మిట్‌ను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సమ్మిట్ లోగోను విడుదల చేశారు.

జీహెచ్‌ఎంసీలో మరో 4 కమిటీలు

సిటీబ్యూరో, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీలో మరో నాలుగు కమిటీలను ఏర్పాటు చేస్తూ కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ అండ్ రోడ్ మేనేజ్‌మెంట్, స్మార్ట్ పోల్ టెండరింగ్ కమిటీ, స్ట్రీట్ లైటింగ్ ప్రాజెక్టుపై కమిటీలు ఉన్నాయి. ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ అండ్ రోడ్ మేనేజ్‌మెంట్ కమిటీలో జీహెచ్ ఎంసీ (ట్రాఫిక్ అండ్ ఐటీ) అదనపు కమిషనర్ కన్వీనర్‌గా జీహెచ్‌ఎంసీ ఈఎన్సీ, హెచ్ ఎండీఏ ఉమ్టా ఎండీ, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఉన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, టీఎంసీ (ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం), పార్కింగ్ పాలసీ, జీఐఎస్ విధానం అమలుపై కమిటీ ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి తగిన నిర్ణయాలను అమలు చేయనున్నది. దీంతో పాటు స్మార్ట్ పోల్ టెండరింగ్ కమిటీలో జీహెచ్‌ఎంసీ (అడ్వర్టైయిజ్‌మెంట్) అదనపు కమిషనర్ కన్వీనర్‌గా, జీహెచ్‌ఎంసీ ఐటీ విభాగం అదనపు కమిషనర్, ఎలక్ట్రికల్ విభాగం అదనపు కమిషనర్ ఉన్నారు. సిటీ స్ట్రీట్ లైటింగ్ ప్రాజెక్టు కమిటీలో జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అదనపు కమిషనర్ కన్వీనర్‌గా, జీహెచ్‌ఎంసీ ట్రాఫిక్ విభాగం అడిషనల్ కమిషనర్, ఎస్‌డబ్ల్యూఎం సీఈకి బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా స్ట్రీట్ వెండర్ పాలసీపై కమిటీ వేశారు. యూసీడీ విభాగం అదనపు కమిషనర్ కన్వీనర్‌గా, ఎస్టేట్ విభాగం అదనపు కమిషనర్‌గా , ఉమ్టా ఎండీ, జీహెచ్ ఎంసీ సీసీపీకి కమిటీలో బాధ్యతలు అప్పగించారు.

నిలిచిన నిర్మాణ రంగ అనుమతులు

జీహెచ్‌ఎంసీలో నిర్మాణ రంగ అనుమతుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. టీఎస్ బీపాస్ వెబ్‌సైట్ సర్వర్ మెయింటెనెన్స్‌లో భాగంగా బుధవారం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత నుంచి సేవలు నిలిచిపోవడంతో దరఖాస్తుదారులు, బిల్డర్లు ఇబ్బందులుపడ్డారు. బిల్డింగ్ కమిటీ పూర్తయిన వెంటనే సేవలకు అంతరాయం ఏర్పడటంతో భవన నిర్మాణ అనుమతులు, ఓసీలు, ప్రొసిడింగ్స్ జారీ నిలిచిపోయింది. సాయంత్రం దాటినా వెబ్‌సైట్ తెరుచుకోలేదు. దీంతో అధికారులు సైతం చేసేది ఏమి లేక వచ్చిన విజిటర్లకు సమాధానం చెప్పలేక తలలు పట్టుకున్నారు. వాస్తవానికి పనివేళల్లో సర్వర్ మెయింటెనెన్స్ నిర్వహించకూడదు. కానీ టీఎస్ బీపాస్ టెక్నికల్ స్టాఫ్ దరఖాస్తుదారుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా సేవలు ఎక్కడికక్కడ నిలిచిపోయేలా చేశారు. అయితే ఉన్నతాధికారులు మాత్రం టీఎస్ స్థానంలో టీజీ మార్చే క్రమంలో తాత్కాలిక అంతరాయం ఏర్పడిందన్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం అధికార వర్గాల నుంచి విభిన్న వాదనలు వచ్చాయి. టెక్నికల్ ఇబ్బందులను సరిచేసే క్రమంలో సర్వర్ డౌన్ అయిందని చెప్పారు. మొత్తంగా వందలాది నిర్మాణ రంగ అనుమతులు నిలిచిపోయి బిల్డర్లు, భవన యజమానులు నిరాశ చెందారు. గురువారం నుంచి టీఎస్ బీ పాస్ వెబ్‌సైట్ వినియోగంలో ఉంటుందని, సేవలు యధావిధిగా కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.